


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

**''అసలెలా పాడయింది ఆ పెయింటింగ్?** మీరు ప్రాణంకన్నా ఎక్కువగా చూసుకుంటారే. ఆ రోజు నా చేతిలో అది చిరిగినప్పుడే మీరు విలవిల్లాడి పోయారుగా.''

అతడు తన చేతి వేళ్ళవైపు చేసుకుంటూ ''వదిలెయ్ కళ్యాణీ. అయిందేదో అయిపోయింది'' అన్నాడు. ఆమె అట్నుంచి ఏదో అంటూంది. అతడు మౌత్‌పీస్ ఒక చేతితో మూసి, ''నా భార్య కళ్యాణి'' అంటూ వెనక్కి తిరిగి, ఆమెతో చెప్పబోయాడు. ఆ అమ్మాయి గదిలో లేదు. ఎప్పుడెళ్ళిపోయిందో వెళ్ళిపోయింది.

''ఎవరితో – 'నా భార్య...' అంటున్నారు?'' అట్నుంచి అడిగింది కళ్యాణి.

''పక్కగది డెలిగేట్స్. అనూజ్ఞ అని... లేదులే వెళ్ళిపోయింది. నీ ఆరోగ్యం ఎలా ఉంది?''

''అలాగే ఉంది. అన్నట్టు మీరు కాంపిటీషన్‌లో పాల్గొనడం లేదన్నారుగా. సాయంత్రం ఫ్లయిట్‌కి వచ్చేస్తారా?''

''నాకు పోటీ మీద పెద్ద ఉత్సాహం లేదు. దేశం నలుమూలల్నుంచీ వచ్చే చిత్రకారుల్ని కలుసుకోవటం కోసం తప్ప. ఎగ్జిబిషన్ అయ్యేవరకూ ఉందామను కుంటున్నాను.''

''మీకు మూడ్ సరిగా లేనట్టుంది...''

''అబ్బే. అటువంటిదేమీ లేదు కళ్యాణీ.''

''ఇవన్నీ మామూలేనండి. వీటికి అప్‌సెట్ అయితే రాత్రిళ్ళు నిద్ర లేకపోవటం తప్ప వచ్చేదేమీ ఉండదు. నా అనుభవం ఒకటి చెప్పనా? గ్రాడ్యుయేషన్ చేసే రోజుల్లో మావయ్య ఇచ్చిన డబ్బులన్నీ కూడబెట్టి, దాంతో సూర్యలక్ష్మి ఆయిల్స్ షేర్స్ కొన్నాను. నెలరోజుల్లో కంపెనీ దివాళా తీసింది. సినిమాలకీ, చాక్లెట్స్‌కీ కూడా లేకుండా మిగుల్చుకున్న డబ్బు. ఎవరికయినా చెప్తే నవ్వుతారు. వంటరిగా ఉన్నప్పుడల్లా ఓ నాల్రోజులు ఏడ్చాను. తరువాత ఇన్వెస్టింగ్ గైడ్ అన్నీ చదివి విమల్ గ్రూపు పట్టుకున్నాను. స్నేహితుల దగ్గరంతా అప్పు తీసుకుని ఆ షేర్లు కొన్నాను. కేవలం డివిడెండ్‌తో ఆర్నెల్లలో అప్పు తీర్చేశాను. రిలయన్స్ గ్రూపుని సరీగ్గా పట్టుకొని లాభం పొందిన భారతదేశపు మొదటి ఇన్వెస్టర్లలో నేనూ ఒక దాన్నన్నమాట...''

''ఇదంతా కాలేజీ రోజుల్లోనా?'' ఆశ్చర్యంగా అడిగాడు.

''అవును.''

''నాకు నిన్ను చూస్తుంటే ఆశ్చర్యంగా ఉంటుంది కళ్యాణీ. ఈ కాలం కాలేజీ అమ్మాయిలూ, అబ్బాయిలూ నిన్ను చూసి నేర్చుకోవల్సింది నిజంగా చాలా ఉంది.''

''భలే... నాకు కూడా మిమ్మల్ని చూస్తుంటే ఆశ్చర్యంగానే ఉంటుంది. నేనెప్పుడూ ఒకటే ఆలోచిస్తూ ఉంటాను. మనిద్దరం దాదాపు ఒకే పరిస్థితుల్లోంచి వచ్చాం. మీ తండ్రి 'జమిందారు'. అంతా పోగొట్టారు. మీరు రోజువారీ తిండికోసమే నానా కష్టాలు పడ్డారు. ఇక నా విషయానికి వస్తే నా స్వంత మావయ్యే నా తండ్రిని చంపాడు. నా ఆస్తంతా తినెయ్యబోయాడు. ఇదంతా చూసి... నేను సాటి మనిషి మీద నమ్మకం ఉంచుకోవటం మానేశాను. మీరు సాటి మనిషిమీద నమ్మకం తప్ప మరేమీ ఉంచుకోలేదు. ఒకే పరిస్థితుల్లోంచి వచ్చిన మనిద్దరం ఇలా వేర్వేరు నమ్మకాలు ఎందుకు పెంచుకున్నామంటారు?''

కార్తికేయ నవ్వాడు. ''...పక్కనే హిమాలయ పర్వతాలున్నాయి. స్వామీ ధృవానందని అడిగి రమ్మంటావా?''

''వద్దులెండి. పెళ్ళి చేసుకుని మొగుడ్ని హిమాలయాలకు పంపిందంటారు. అన్నట్టు ఈ పది నిముషాలూ అసలు విషయం మర్చిపోయి ఏదేదో మాట్లాడుతున్నాను. మీరు మాత్రం పెయింటింగ్ గురించి ఏమీ బాధపడకండి. నాకో మంచి ఆలోచన వచ్చింది.''

''ఏమిటది కళ్యాణీ.''

''మొత్తం మీ బొమ్మలన్నీ ఓ కోటి రూపాయలకు ఇన్సూర్ చేయించడం... ఎలా ఉంది నా ఆలోచన?''

అతడో క్షణం ఆగి, ''బావుంది. గిన్నీస్ బుక్ కూడా ఎక్కొచ్చు. దానికేంగానీ, నీకు ఇంట్లో అన్నీ సరిగ్గా అమరుతున్నాయా? ఏమైనా తోస్తుందా?'' అన్నాడు.

వ్యాపారం టాపిక్ వచ్చేసరికి ఆమె ఉత్సాహంగా ''బెడ్రూంలోనే టీవీ స్క్రీన్ ఏర్పాటు చేయించాను. ఏ రోజు కారోజు బోంబే స్టాక్ ప్రొసీడింగ్స్ అన్నీ కంప్యూటరైజ్ చేసి వీడియో కాసెట్ పంపిస్తున్నారు. తిరిగే కాలు కదిలే చెయ్యి ఊరుకోదంటారుగా. ఈ వ్యాపారం మొదలుపెట్టాను. పక్క మీద నుంచి లేచే అవసరం కూడా లేకపోవటంతో మెదడు మరింత చురుగ్గా ఉంది. నిన్న పదివేలు చిలక్కొట్టుడు కొట్టాను'' అంది.

''ఎడారిలో ద్రాక్షపళ్ళు పండించగలవు కళ్యాణీ నువ్వు.''

''తొందరగా వచ్చేయండి. ఇద్దరం కల్సి పండించవలసినవి చాలా ఉన్నాయ్... బై'' ఫోన్ పెట్టేసింది.

అతను కూడా ఫోన్ పెట్టేసి వచ్చి కుర్చీలో కూర్చుంటూ ఉండగా కాలికి పెయింటింగ్ తగిలింది. మంచు కొరికెయ్యగా మిగిలిన రంగుల్తో దీనంగా ఉన్న ఆ కాగితాన్ని అతడు వంగి చేతుల్లోకి తీసుకున్నాడు. ఎందుకో తెలీదు గానీ,

అప్రయత్నంగా అతని చేతులు వణికాయి. శవాన్ని ముందుంచుకొని దుఃఖానికన్నా అతీతమైన వేదనా స్థితిలో ఉన్నప్పుడు, పక్కగదిలోంచి దశదిన కర్మలకు ఏం కూరలు వండాలా అన్న చర్చ వినిపిస్తూంటే కలిగే మానసిక స్థితి. తనలో మార్పు తనకి తెలుస్తోంది. కొద్దిగా మాటల్లో శ్లేష, చిరాకు, బాధ... అన్నీ తెలుస్తున్నాయి. ఆహారాన్ని ఆక్టోపస్ ఆక్రమించినట్టు ఏదో పొర తనని కప్పేస్తోంది. ముందంత 'కన్సర్న్' లేదు. కళ్యాణి వాదనే కరెక్టా? ఈ సమాజంలో బ్రతకాలంటే కోపం, దుఃఖంలాంటి రకరకాల అనుభూతులకు లోనవ్వాల్సిందేనా? అతడు రెండు చేతుల్లో మొహం దాచుకుని అనుకున్నాడు ''భగవంతుడా! నువ్వు ఉన్నావో లేదో నాకు తెలియదు. ఉంటే మాత్రం నాకు కొద్దిగా 'ఫీలింగ్' నివ్వు. ఇంత వరకూ అందరూ నిన్ను డబ్బుకోసం, కీర్తి కోసం, కష్టాలు కడతేర్చమనటం కోసం ప్రార్థించి ఉంటారు. నేను మాత్రం చేజారిపోతున్న నా ఫీలింగ్స్ కోసం ప్రార్థిస్తున్నాను. మెడిసిన్ కన్నా కుంచె ఎక్కువ ఆనందాన్ని ఇస్తుందని తెలిసి, మెడిసిన్‌ని మధ్యలో వదిలి పెట్టి కూడా సంతోషంగానే ఉండ గలిగే ఫీలింగ్‌ని నాతో 'కొనసాగ'నివ్వు. ఈ క్షణం సర్వస్వం కోల్పోయినా ఏ మాత్రం బాధ లేకుండా రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకోవటంలో ఆత్మన్యూనతా భావం కలగని ఫీలింగ్‌ని 'తిరిగి నాకనివ్వు''.

''మిత్రాజీ...'' దూరంగా గాలిలో నుంచి వినిపించిన కేకకి అతడు నుదుటి మీద నుంచి చెయ్యితీసి చుట్టూ చూశాడు. గది బయట వరండా కూడా ఖాళీగానే ఉంది.

మళ్ళీ ''మిత్రాజీ...'' అని గట్టిగా వినిపించింది. అతడు వెనక్కి తిరిగి కిటికీవైపు వచ్చాడు.

అతడున్న హోటల్ చిన్న కొండమీద ఉంది. వంద అడుగుల క్రింద... రోడ్డు మీద నుంచుని అనూజ్ఞ అరుస్తోంది. అతను కిటికీలో కనపడగానే, ''...రండి'' అంది. ఆమె చేతిలో పెద్ద ప్యాకెట్ ఉంది. అతడికేమీ అర్థంకాలేదు. ''ఎక్కడికి?'' అన్నట్టు సైగ చేశాడు.

''మీరే క్రిందికి రండి. చెప్తాను. ఇప్పుడు నేను ఆ చుట్టూ తిరిగి కొండ ఎక్కలేను'' అని అరిచింది. రోడ్డు మీద వెళ్ళేవాళ్ళు ఆగి చిత్రంగా చూస్తున్నారు. ఆ అమ్మాయి మాత్రం 'నవ్విపోదురుగాక – నాకేమిటి?' అన్నట్టుగా అలాగే నడుముకి చేతులు ఆన్చి పైకి చూస్తోంది. అతడికి మొహమాట మేసింది. ఆ అమ్మాయిలా అరవలేక పోయాడు గొడవ ఎక్కువ చెయ్యలేక అతడు గది తాళం వేసి క్రిందికి వచ్చేసరికి ఆ అమ్మాయి రోడ్డు ప్రక్కన బ్రిడ్జిమీద కూర్చుని ఒక్కొక్క రాయి నీళ్ళలోకి విసురుతోంది.

''పదండి వెళ్దాం. ఇవి పట్టుకోండి'' అంది.

''ఎక్కడికి వెళ్ళటం? ఇవేమిటి?''

''కేన్వాసూ, స్టాండూ, పెయింట్సూ. మనం ఆ లాండ్–స్కేప్‌లోకి వెళుతున్నాం. వెళ్ళాక సీను ఎక్కడయితే బావుంటుందో మీరే నిర్ణయించాలి'' అంది.

అతడు విచలితుడయ్యాడు. ''ఏమిటిదంతా? నాకేమీ అర్థం కావటం లేదు.''

''మీరు బొమ్మ వేయబోతున్నారు. అందుకోసం మనం వెళుతున్నాం.''

''నీకు నిజంగా మతిపోయింది. నేనిప్పుడు ఇలా బొమ్మెయ్యటమేమిటి?''

ఈ గొడవకి ఇద్దరు ముగ్గురు ఆగి నిలబడి చూడసాగారు. ఒకబ్బాయి దగ్గరగా వచ్చి, ''మేడమ్, మీరు సినిమా యాక్టరా?'' అని అడిగాడు హిందీలో.

''అవును.''

''పేరు?''

''మమతారే. బెంగాలీ డైరెక్టర్ సత్యజిత్‌రే తెలీదూ. ఆయన కూతుర్ని'' అంది. కార్తికేయ అయోమయంగా చూస్తున్నాడు. ఆ కుర్రాడు చిన్న పుస్తకం తీసి ''ఆటోగ్రాఫ్ ప్లీజ్–'' అన్నాడు. ఆమె దాన్ని అందుకుని కార్తికేయ వైపు చూసి నవ్వి కన్ను కొట్టింది. అందులో సంతకం పెడుతూ, ''ఆటోగ్రాఫ్ పుస్తకం పట్టుకుని తిరుగుతున్నావేమిటి?'' అంది.

''ఊళ్ళోకి చాలామంది ప్రముఖులు దిగారుగా మేడమ్. అందుకని'' అన్నాడు.

ఆమె సంతకం పెట్టి ఇస్తూ, రహస్యంగా ''ఆయనతో పెట్టించుకోవా?'' అంది.

''ఆయనెవరు మేడమ్?''

పుస్తకం తిరిగి ఇస్తూ ''అమితాబచ్చన్ మేనల్లుడు. ఫ్యూచర్ హోప్ ఆఫ్ హిందీ ఇండస్ట్రీ'' అంది. కుర్రాడి మొహం ఎగ్జయిట్‌మెంట్‌తో నిండింది. కార్తికేయని ప్రశ్నలతో ముంచెత్తాడు. ఎలాగో అతన్ని వదిలించుకుని కార్తికేయ బయటపడ్డాడు.

''ఏమిటిదంతా అనూజ్ఞా.''

''జస్ట్ థ్రిల్''

''నాకిలాటివి ఇష్టం ఉండవు. అదీగాక నాకిప్పుడు బొమ్మలేసే మూడ్ లేదు. ఒక స్టాండుకి కాన్వాసు తగిలించుకొని చేతికొచ్చిన గీతలు గీయలేను నేను'' సీరియస్‌గా అన్నాడు.

ఆమె నడుస్తున్నదల్లా ఆగి, ''సరే అయితే మీరు వెళ్ళండి. నేను వెనక్కి రాను'' అంది. అకస్మాత్తుగా ఆమె మొహంలో వచ్చిన మార్పుకి అతడు ఆశ్చర్యం చెంది, ''ఏం చేస్తావ'ని అడిగాడు.

''ఢిల్లీ వెళ్ళిపోతాను. లేదంటే ఈ అడవిలోకి వెళ్ళి ఏడుస్తాను. ఏడుపు ఎక్కువైతే చచ్చిపోతాను.''

''నీకు మతిపోయింది. ఇంత చిన్న విషయానికి చచ్చిపోతావా?''

''చిన్న విషయమా? మీకు చిన్న విషయమైతే అవ్వొచ్చుగానీ నాకు కాదు. నా జీవితంలో అతి విషాదకరమైన సంఘటన ఈ బొమ్మలతో ముడిపడి ఉంది'' ఆమె నడక సాగిస్తూ ఉంది. ''అది... నా భర్త జీవన్మరణానికి సంబంధించిన విషయం.''

అతడు సంచలితుడై ఆగి ''నీ భర్తా?'' అన్నాడు విస్మయంగా. ఆ అమ్మాయి వయసు ఇరవైకి కాస్త అటూ ఇటూ ఉంటుంది. ''అవును. నాకు చాలా చిన్నప్పుడే, అంటే ఇంటర్మీడియెట్ చదివే రోజుల్లోనే పెళ్ళయింది. ఆ రోజుల్లోనే తలమునకలయ్యే ప్రేమలో పడ్డాను. రాజేష్‌ని చూస్తే ఎవరు ప్రేమలో పడకుండా ఉండగలరు. స్మార్టెస్ట్ బాయ్ ఆన్ ఎర్త్. నాన్నని ఎదిరించి పెళ్ళి చేసుకున్నాం. రాజేష్ పెయింటర్. నేను కూడా పెయింటర్నే. 'మైనే ప్యార్ కియా' రచయిత మా ప్రేమని చూసుంటే ఆ సినిమా ఇంకో సంవత్సరం ఎక్కువ ఆడేలా తీసి ఉండేవాడు. రాజేష్ తండ్రి కలప కాంట్రాక్టరు. ఆయనకీ మా పెళ్ళి ఇష్టమే. మినిష్టర్ కూతుర్ని కోడలిగా చేసుకోవటం ఎవరికి ఇష్టం ఉండదు. రాజేష్, నేనూ అడవిలో కాపురం పెట్టాం. చెక్కల ఇల్లూ, పక్కనే సెలయేరు. మమ్మల్ని చూసే చలం మైదానం వ్రాసుంటాడు. అప్పటికి నేను నాల్గోనెల గర్భవతిని. ఆ రోజు రాత్రి పదింటికి జరిగింది ఆ సంఘటన. మీరు 'షోలే' సినిమా చూశారా?''

''లేదు. ఏం?''

''ఏం లేదు. మధ్యప్రదేశ్ అడవుల్లో ఉండేవాళ్ళమని చెప్పానుగా. చంబల్ లోయ దొంగలకి ప్రసిద్ధి. అందుకని మా దగ్గర విలువైనవి ఏమీ ఉంచుకునేవాళ్ళం కాదు. సాధారణంగా అడవుల్లో ఉండే కాంట్రాక్టర్లు అలానే చేస్తారు. చంబల్ దొంగలు స్త్రీలను ముట్టుకోరు. అదీ ధైర్యం. ఆ రాత్రి నలుగురు దొంగలు మా ఇంటిని చుట్టుముట్టారు. ఒక రైఫిల్ తప్ప ఏమీ దొరకలేదు. దాన్ని తీసుకుని వెళ్ళబోతోంటే ఒక బందిపోటు దృష్టి గోడలకున్న బొమ్మలమీద పడింది. దొంగలక్కూడా కళాత్మక హృదయం ఉంటుందని నాకు తెలీదు. ఆ బొమ్మలు రాజేష్ ఎంతో కష్టపడి వేసినవి. ఆ విషయం నాకు తెలుసు. నేను వాళ్ళకి అడ్డుపడ్డాను. ప్రాణం పోయినా సరే ఆ బొమ్మలు రాజేష్ నుండి వేరు కాకూడదు అనుకున్నాను. పొయ్యిలో కట్టె తీసి వెనుకనుంచి ఒక దొంగ తల మీద బాదాను. అదే నేను చేసిన పొరపాటు. చంబల్‌వాలీ దొంగలు ప్రతిఘటనని సహించలేరు. ఇద్దరు వచ్చి నా పెడరెక్కలు గట్టిగా పట్టుకున్నారు. నాలుగో నెల గర్భవతిని అనైనా చూడకుండా నా భర్త ముందే రేప్ చేశారు.''

కార్తికేయ పాముకాటు తిన్నవాడిలా ఆమె వైపు చూశాడు. ఆమె నడుస్తూంటే చెట్ల నీడలు ఆమె మొహం మీద నుంచి వెనక్కి కదిలి వెళ్ళిపోతున్నాయి. ఆమె తల వంచుకుని నడుస్తూ, తనలో తానే మాట్లాడుకుంటున్నట్టు... చదివేసిన పుస్తకం తాలూకు పేజీలు వెనక్కి తిప్పి చూసుకుంటున్నట్టు కొనసాగించింది. ''మామూలుగా నావైపు ఎవరైనా కన్నెత్తి చూస్తేనే సహించలేని రాజేష్, ఈ సంఘటనతో పిచ్చి బలం తెచ్చుకుని, వెళ్ళిపోతూన్న దొంగల్లో ఒకడిని వెనుక నుంచి పొడిచాడు. మిగిలిన దొంగలు రెచ్చిపోయి, ఆ కత్తితోనే రాజేష్ కుడిచెయ్యి నరికి పారేశారు. ఆ దృశ్యం నాకింకా బాగా గుర్తుంది. అతడి చెయ్యి నేలమీద ఆఖరి ప్రాణంతో కొట్టుకుంటూంది. అప్పుడే అబార్షన్ జరిగింది. నా వయసు పదిహేడేళ్ళు అప్పుడు.''

కార్తికేయ పెదాలు బిగపట్టాడు.

‘‘రాజేష్ చెయ్యి నరికి దొంగలు అడవిలోకి పారిపోయారు. దొంగని చంపినందుకు రాజేష్‌కి న్యాయస్థానం జైలుశిక్ష వేసింది. నన్ను ఖాళీగా ఉంచటం ఇష్టంలేని నాన్నగారు మళ్ళీ కాలేజీలో చేర్పించారు. అప్పుడప్పుడు తీహార్ జైలుకు వెళ్ళి రాజేష్‌ని చూసి వస్తుంటాను. ఇద్దరం సంతోషంగానే ఉన్నాం. రాజేష్ ‘‘అనూజ్ఞా! ఒక పాత నల్ల దుప్పటి కొనుంచు’’ అని అంటూ ఉంటాడు. ఎందుకంటాన్నేను. ‘జైలు నుంచి గెడ్డంతో బయటకు రాగానే అది భుజాల చుట్టూ కప్పుకుని చుట్ట నోట్లో పెట్టుకుని, చంబల్‌వాలీలోకి వెళ్ళి ఆ దొంగల్ని నలుగుర్ని చంపాలి’ అని! అతనంత మామూలుగా ఉండటం నాకూ సంతోషంగానే ఉంది.

అప్పుప్పుడు ‘చెయ్యి పోయినందుకు నీకు బాధేమన్నా ఉందా?’ అని అడుగుతూ ఉంటాడు. ‘...అదెలాగో నా సవతి’ అంటాన్నేను. ఆశ్చర్యపోతాడు. ‘అవును మరి దాంతో ఎప్పుడూ పెయింటింగ్స్ వేసేవాడివి. అది పోయింది కాబట్టి నాతోనే ఉంటావు. నాతో రొమాన్స్ చేయటానికి ఒక్క చెయ్యి చాల్లే’ అంటూ ఉంటాను. మాకు ఒకటే కోరిక. ‘ఎప్పుడు తను బయటకు వస్తాడా, ఎప్పుడు ఆ అడవిలో సెలయేటి పక్క మా చెక్కల బిల్డింగ్‌కి తిరిగి వెళ్ళిపోదామా అని...” ఆమె అతడివైపు చూసి నవ్వింది. ‘‘చూశారా! ఒక్క పెయింటింగ్ మా జీవితాన్ని ఎన్ని మలుపులు తిప్పిందో’’ అంది.

కార్తికేయ వినటం లేదు. అతని మనోనేత్రంలో మూడో ద్వారం తెరుచుకున్నట్టు ఉంది. ఒక సమస్యకి తను వేదాంతంతో స్పందించాడు. తన భార్య తెలివితేటల్తో దాన్ని అధిగమించటానికి ప్రయత్నించింది. కానీ ఈ అమ్మాయి సమస్యని అసలు పట్టించుకోలేదు. అంత కన్నా పెద్ద అవమానం ఒక సమస్యకి ఏమైనా ఉందా? దాన్నసలు పట్టించుకోకుండా పరిహసించటం..!

ఆ చిన్నపిల్ల అతడికి థర్డ్ డైమెన్షన్‌లో కనబడింది. రాజేష్ ఒక అపూర్వమైన వ్యక్తిగా తోచాడు. చిన్నపిల్లలు ఆడుకుంటున్నప్పుడు దెబ్బ తగిలితే, క్షణాల్లో మర్చిపోయి, మళ్ళీ ఆటలోనూ, ఆనందంలోనూ మునిగిపోయినట్టు, అల్లరి వెనుక ఇంత బాధావల్లరి ఉన్నట్టు తెలియనివ్వకుండా– అసలు మనోఘర్షణే లేకుండా... సరదాగా– వేదాంతం కన్నా పెద్దదైన ‘‘స...ర...దా...గా’’... బాల్యం గొబ్బి చెలుల స్నేహం నాడు కాంతిలా– వయసు వన్నె తొడిగినప్పుడు కన్నె సంక్రాంతిలా– ఆమె అపురూపంగా తోచింది.

....

‘‘చెప్పండి మిత్రాజీ. ఒక పెయింటింగ్ ఎంత పని చేసిందో చూశారుగా. మళ్ళీ ఇన్నాళ్ళకి మీ పెయింటింగ్ పాడుచేసి నా మనసుతో చివాట్లు తిన్నాను. నన్ను నేను తిట్టుకోకుండా ఉండాలంటే మీరు మళ్ళీ బొమ్మ వేయాలి. ఒక్కరోజులో దాన్ని పూర్తిచేసి రికార్డు స్థాపించాలి. లేకపోతే నా మానసిక క్షోభకి అంతుండదని అనను గానీ, రాజేష్ చెవి మెలేసి గుంజీలు తీయిస్తాడు. నా ఆనందం కోసం మీరింత చిన్నపని చేయలేరా?” అంది.

అది చిన్నపని కాదని అతడికి తెలుసు. కొంకర్లు పోయిన చేతివేళ్ళ వంక చూసుకుంటూ గుండెలనిండా బలంగా గాలి తీసుకుని, ''వేస్తాను'' అన్నాడు.

ఆమె మొహం విప్పారింది. ''థాంక్స్'' అంది. ''...నన్నొక గొప్ప మెంటల్ టార్చర్ నించి రక్షించారు.''

కార్తికేయ ఆమె మాటలు వినటం లేదు. అతనిలోని కళాకారుడు అప్పటికే మూడ్‌లోకి వెళ్ళిపోయాడు. ఒక ఏటవాలు ప్రదేశం క్రింద స్టాండు పెట్టి చుట్టూ చూశాడు. కొండ మీద త్రిశూలాలు గుచ్చినట్టు ఒక పక్కంతా సైప్రస్ చెట్లు. చెట్ల సందుల్లోంచి నిశ్శబ్ద సంగీతాన్ని వినిపిస్తోన్న గాలి, హిపోక్రటిక్ కాంక్రీట్ జంగిల్ నుంచి దూరంగా మరో ప్రపంచానికి తీసుకు వెళ్తున్నట్టు హిప్నటైజ్ చేస్తోంది.

కొండలమీద వెండి కరిగి క్రిందికి ప్రవహించినట్టుంది మంచు. 'ఆ దృశ్యం చూడటానికి వెయ్యి కళ్ళుండాలి' అంటారు. కాదు. మనసుకి కళ్ళుండాలి.

ఏ చిత్రం వెయ్యాలో అతనికి తోచలేదు. ఒక చిన్న భావం మనసులో విత్తనంలా పుట్టి, క్రమంగా పెరిగి ఒక ఆకృతి దాల్చుకుని, ఇక దాన్ని చిత్రించకపోతే తప్ప లాభంలేదు... అన్న ప్రసవవేదన మొదలైతే తప్ప కుంచె పట్టుకోవడం ఇంతకు ముందు అతడికి అలవాటు లేదు. కుంచె వెనుకభాగంతో గెడ్డం గోక్కున్నాడు. దూరంగా ఆ అమ్మాయి ఒక కొండరాతి మీద కూర్చుని గాలిలో కాళ్ళాడిస్తూ పాడుకుంటోంది. పరీక్షకు కూర్చున్న కుర్రాడు ప్రశ్నకు సమాధానం తట్టక ఇన్విజిలేటర్ వైపు దీనంగా చూసినట్టు అతడు ప్రకృతి వైపు చూశాడు.

''ఏం మిత్రాజీ! ఏమిటలా ఉండి పోయారు?'' ఆమె వెనుకనుంచి వచ్చి అడిగింది.

''ఏం గీయాలో తెలియటం లేదు.''

ఆమె కిలకిలా నవ్వింది. అతడామె వైపు తలతిప్పి చూశాడు. ఏమనుకుంటూంది ఈ అమ్మాయి? ఒక గేయమైనా, చిత్రమైనా రావాలంటే మనసు గ్రీష్మాన్నో– వసంతాన్నో అనుభవించాలి. గుండె గాయపడటమో, హృదయం నవ్వటమో జరగాలి.

''ఎందుకు నవ్వుతున్నావు?''

''రాజేష్ కూడా ఇలాగే తల గోక్కునేవాడు. ఏం గీయాలి అని విసుక్కునేవాడు. 'ప్రేరణ రావటం లేదా మిత్రమా? నీ కుంచెని నా గుండెలో ముంచి గీయి' అని నేననేదాన్ని! అది గుర్తొచ్చి నవ్వొచ్చింది. భూమి ఆకాశాలు కలిసే చోటు నుంచి మొదలు పెట్టి గీత గీయండి మిత్రాజీ. తరువాత అదే వస్తుంది.''

అతను కుంచెను రంగులో ముంచ బోయాడు. మంచువల్ల బిగుసుకున్న ఎముకలు సహకరించటానికి నిరాకరించాయి. అతడు మరింత ప్రయత్నం చేశాడు. నరాలు తెగుతున్న నొప్పి, బాధని కళ్ళవెనుక దాచుకుని ఆమెవైపు

చూశాడు. ఆమె ఎప్పుడో అక్కడనుంచి కదిలి వెళ్ళిపోయింది. ఏదో పాట పాడుకుంటూ తిరిగి వెళ్ళి కొండరాళ్ళమీద కూర్చుంది.

రెప్పపాటు కాలంలో పట్టుకున్నట్టు అతని కళ్ళు ప్రకృతినీ, ఆమెనీ పట్టుకున్నాయి. అక్కడామె అనూజ్ఞ కాదు. ఒక సౌందర్యం. అంతే. అనూహ్యమైన సౌందర్యం.

మంచు పొగల్నీ, మంచు వెన్నెల్నీ కలిపి రంగరించినట్టు ఉన్నదా సౌందర్యం. ఆమె కళ్ళలోంచి 'నిర్మలాన్ని' అరువు తీసుకుని ఆకాశం నీలిరంగుని సంతరించుకుంది. ఆమె కురుల్లోంచి 'చీకటి'ని బదులు తీసుకుని సైప్రస్ చెట్లు తమ నీడలుగా పరుచుకున్నాయి. కొండల మీది మంచు ఆమె చెక్కిళ్ళ నునుపుదనాన్ని నిమిరి సిగ్గుపడింది. మొగల్ సరాయి స్టేషన్‌లో తప్పిపోయిన 'త్రిపుర' కళ్యాణో, పల్లకీలోంచి దిగిన 'కృష్ణశాస్త్రి' ఊర్వశో, ఆ కొండల మధ్య సౌందర్యంగా రూపుదిద్దుకుని అతడి నరాల్ని సుతారంగా నిమిరారు.

బాధని కాంక్ష అధిగమించగా అతడి కుంచె కదలింది.

భూమి ఆకాశం కలుసుకునే చోట గీత లేదు. అది అతడి ఊహా సుందరి. ఆ గీత పెదవుల మధ్య రేఖ అయింది. కొండల మధ్య దూకే సెలయేరు కనపడటం లేదు. కిలకిల నవ్వు వినపడుతోంది. మేఘం వెనుక ఎరుపేమైంది? అమ్మాయి చిగురాకు పెదవైంది. తడిసిన సూర్యుడిని మేఘం క్రింద నుంచి చిరువెలుగు 'వ్వె వ్వె వ్వె' అని వెక్కిరించినట్టు అతడి శారీరక బాధని ఆ ప్రకృతి సౌందర్యం పరిహసించింది. బాధ గొప్పదేగానీ కాంక్ష ఇంకా పెద్దది. అతడు తనలో తాను మునిగిపోయాడు. ఒక కసితో నాట్య రచన ప్రారంభించి, ఆ రచన తాలూకు అందాల్ని ఆస్వాదించటంలో మునిగిపోయిన కళాకారుడిలా, అతడు ఆ అమ్మాయి విషయం మర్చిపోయి తన పనిలో తను లీనమయ్యాడు. ఓరకంట అది గమనించి ఆమె అక్కడి నుంచి జారుకుంది. గమనించే స్థితి అతడు ఎప్పుడో దాటిపోయాడు.

అతడు రెండుగంటలపాటు స్వాప్నికాలోకంలో విహరించి తిరిగి భూమ్మీద కొచ్చేసరికి ఆ అమ్మాయి దూరం నుంచి వస్తూ కనిపించింది. ఉత్తర భారతదేశంలో 'టీ' ముంతలో పోసి అమ్ముతూ ఉంటారు. అటువంటి ముంత ఒకటి చేతితో పట్టుకుని, మరొక చేతితో చెత్తకాగితాలు ఏరుకునేవాడి లెవెల్లో ఒక గోనెసంచి భుజాన వేసుకుని ఆమె కొండదిగి వస్తూంటే అతడు ఆశ్చర్యపోయి, ''ఏమిటది?'' అని అడిగాడు.

''టీ''

''అదిసరే. ఆ సంచి ఏమిటి?''

''ఎండుటాకులు.''

అతడు అదిరిపడి, ''ఎండుటాకులా...'' అన్నాడు.

''అవును మిత్రాజీ! ముంతలో 'టీ' ఇక్కడికి వచ్చేసరికి చల్లారిపోతుంది కదా. ఇక్కడేమో మంచులో తడిసిన ఆకులు తప్ప మరేమీ దొరకవు. అందుకే వస్తూ వస్తూ గొప్ప దూరదృష్టితో ఇవి కూడా తెచ్చా'' అని గబగబా మూడు రాళ్ళు జరిపి వాటిమీద ముంత పెట్టి క్రింద వెలిగించింది. ఆమె మోకాళ్ళ మీద కూర్చుని వంగి పొగ ఊదుతోంటే, ''ఫ్లాస్కులో పోసి తేవొచ్చుకదా. ఇంత కష్టం దేనికి?'' అన్నాడు.

ఆమె ఊదటం ఆపి, తల పైకెత్తకుండా కేవలం కళ్ళు పైకెత్తి ''...రెంటికీ తేడా లేదా?'' అంది.

''ఏముంది?''

''సెవెన్ థర్టీకి ఫామిలీని తీసుకుని బ్లూ మౌన్‌టేన్‌కి డిన్నర్ కొచ్చేయ్' అనటానికి, 'మా ఆవిడ పులిహోరా, బొబ్బట్లూ చేసిందోయ్. సతీ పుత్ర సమేతంగా సాయంత్రం ఇంటికిరా' అనటానికీ మధ్య ఉన్నంత తేడా ఉంది'' అనేసి తిరిగి తన పనిలో నిమగ్నమైంది.

అతడు మౌనంగా ఆమె చేస్తున్న పని వైపు చూడసాగాడు. ''చాంద్ బన్‌కే...తూ గగన్ సే...'' అని పాడుకుంటూ టీ వెచ్చబెట్టిచ్చి ''ఇది ఏ రాగం'' అంది.

అతడు అన్యమనస్కంగా ''ఏది ఏ రాగం'' అని అడిగాడు.

''నేను కోయిల్లా పాడుతోంటే వినపడటంలే...?''

''నాకు రాగాల సంగతి తెలీదు.''

''కళ్యాణి అనుకుంటా. ప్యార్ భరా దిల్ సినిమాలోనిది. ఈ కొత్తగా వచ్చిన ఆనంద్ మిలింద్, నిఖిల్ వినయ్, అందరూ కర్నాటక రాగాల్ని, దక్షిణాది సంగీతాన్ని ఉత్తరాది వాళ్ళకి పరిచయం చేసి పాపులర్ అయిపోతున్నారు. నదీమ్ శ్రావణ్ కూడా అంతే. బప్పీలహరీ, ఆర్డీ బర్మనూ అయిపోయాక హిందీవాళ్ళకి మళ్ళీ స్లో సంగీతం బాగా నచ్చుతున్నట్టుంది కదూ''.

''నాకు అంతగా తెలీదు.''

''తెలిసే అవకాశం లేదు లెండి. మీ ప్రపంచమంతా బొమ్మలేగా. మేము ఢిల్లీలో ఉంటాం కాబట్టి మాకు తప్పదు. మీకు తెలుసా? నాకు ఢిల్లీ అసలు నచ్చదు. చెవిలో జోరీగలాగా 'వెలగబెట్టిన మంత్రిపదవి చాల్లే నాన్నా, పల్లెటూరికి వెళ్ళి పొలాలు చూసుకుంటూ సెటిలవ్వు. అప్పుడప్పుడు రాజేష్ నేనూ వస్తుంటాము' అని నేను మా నాన్నగారికి ఎప్పుడూ చెపుతూ ఉంటాను. వినడే. కొల్లగొట్టడానికి ఇంకా దేశంలో బోలెడున్నట్టు 'కొంతకాలం ఆగమ్మా'– అంటాడు. మీరే చెప్పండి. ఢిల్లీ బావుంటుందా? పల్లెటూరు బావుంటుందా?''

అతడు టీ త్రాగుతూ, ''ఏమిటి పల్లెల్లో నీ కంత నచ్చింది?'' అని అడిగాడు.

''అబ్బో మేము పల్లెటూరు వదిలేసి పదిహేను సంవత్సరాలైంది లెండి. అప్పుడు నాకెన్ని? ఆరో, ఎనిమిదో ఏళ్ళు. మీరు చెప్పండి. మనింట్లో ఎనిమిదేళ్ళ పాప ఎవరికైనా జ్వరం వస్తే పల్లెటూళ్ళో అయితే చాకలీ, పాలుపోసేవాడూ, దారినపోయే ముసలాయనా, గుడి నుంచి సాయంత్రం ఇంటికెళ్ళే పూజారీ, ధన్వంతరీ... అందరూ మనింటిదగ్గర ఓ క్షణం ఆగి, 'పాపకెలా ఉందమ్మా' అని పరామర్శిస్తారా లేదా? అదే ఢిల్లీ అయితే మనకెందుకు అనుకుంటారు. ఏ టెర్రరిస్టో పేల్చేసినా పోలీసులొచ్చి మన అడ్రసు కనుక్కోవాల్సిందే. అవునా కాదా?''

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments